20022024-DIS-04_Layout 1 2/20/2024 1:37 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ప్రజాస్వామ్యానికి విఘాతం

**రష్యాలో** రాజకీయ ప్రత్యర్థులు అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం కొత్తేమీ కాదు. గతంలో అనేకమంది ప్రభుత్వ వ్యతిరేకులు అంతుతెలియని మరణాల పాలయ్యారు. తాజాగా అలెక్సీ నవాల్నీ మృతి ఆ కోవలోకే చేరింది. 47 సంవత్సరాల నవాల్నీ ఉదయం వాకింగ్‌కు వెళ్లినప్పుడు ఒక్కసారిగా కుప్పకూలి మరిక లేవలేదని అధికారులు అంటున్నారు. గత మూడేండ్లుగా ఆయన రష్యా ఉత్తర కొసన గల ఐకే-త్రీ లేదా పోలార్ వుల్ఫ్ అనే దుర్భర, దుర్భేద్యమైన జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. పైగా గత 300 రోజులుగా ఆయన ఏకాంత నిర్బంధంలో గడుపుతున్నారు. అయితే మరణానికి ఒకరోజు ముందు ఆయన ఒక కోర్టు వీడియోలో సంపూర్ణ ఆరోగ్యంతో, ఉత్సాహంగా కనిపించడం గమనార్హం. ఈ నేపథ్యంలో నవాల్నీ హఠాన్మరణం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఆయన తలపై, ఛాతీపై బలమైన గాయాల గుర్తులున్నట్టు ధ్రువీకృతం కాని వార్తల ద్వారా తెలుస్తున్నది. క్రమంగా ఆరోగ్యం దిగజారిందా లేక హఠాత్తుగా గుండెపోటు వచ్చిందా లేక మరి ఏదైనా ఇతర ఘటన ఆయన ప్రాణాలు తీసిందా అనేది ఇప్పుడప్పుడే తేలకపోవచ్చు. తనను చంపాలని రష్యా ప్రభుత్వం చూస్తున్నట్టు నవాల్నీ మొదటి నుంచీ చెప్తూనే ఉన్న సంగతి సందర్భంగా గుర్తు చేసుకోవాల్సి ఉంది. రష్యాలో అణచివేతను ప్రతిఘటించినందుకు నవాల్నీ తన ప్రాణాలతో మూల్యం చెల్లించారని పాశ్చాత్య దేశాలు అంటున్నాయి. గత దశాబ్దకాలంగా నవాల్నీ రష్యా ప్రభుత్వ అవినీతిని ఎండగడుతూనే ఉన్నారు. నవాల్నీ తరహా అనుమానాస్పద మరణాలపై క్రెమ్లిన్ మౌనం వహిస్తుంది లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించి చేతులు దులిపేసుకుంటుంది.

అలెక్సీ నవాల్నీ రష్యా రాజకీయాల్లోకి ప్రవేశించినప్పుడు ఆయనకు ఎంతో అద్భుతమైన భవిత ఉందని అందరూ జోస్యం చెప్పారు. ఏదో ఒక రోజు ప్రజాస్వామిక పునరుద్ధరణ సాధించి రష్యాకు నవాల్నీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు మండేలా తరహాలో మహానాయకుడు అవుతాడని అంతా అనుకున్నారు. అయితే 2008లో ఆయన రాజకీయాల కన్నా అవినీతి అంతానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం ఒక పెద్ద మలుపు. ప్రభుత్వ కార్పొరేషన్ల నుంచి కోట్లు కొల్లగొట్టే అధికారుల అవినీతిని ఆయన బయటపెట్టేవారు. పార్టీ ఆఫ్ క్రూక్స్ అండ్ థీవ్స్ అంటే మోసగాళ్లు దొంగల పార్టీ అని ఆయన పుతిన్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టేవారు. ఇప్పుడు అది హంతకుల పార్టీ కూడా అయ్యిందని అంటున్నారు.

రష్యా అధ్యక్ష ఎన్నికలు మరో నెలరోజుల్లో ఉన్నాయనగా నవాల్నీ చనిపోవడం గమనార్హం. ఈ ఎన్నికల్లో గెలిచి మరో ఆరేండ్లపాటు రష్యాపై తన పట్టును కొనసాగించాలని పుతిన్ భావిస్తున్నారు. అధికారం ఒకవ్యక్తి చేతుల్లో కేంద్రీకృతమై ఉండడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, దానిని భగ్నం చేయాలని నవాల్నీ అనేవారు. నియంతృత్వ చక్రభ్రమణాన్ని ఆపాలంటే పార్లమెంటరీ రిపబ్లిక్ ఏర్పాటే శరణ్యమని చెప్పేవారు. ప్రజల మాటే అంతిమం కావాలని వాదించిన నేత అనుమానాస్పదంగా అంతమైపోవడం ప్రజాస్వామ్యానికి గొప్ప నష్టమే కాదు విషాదం కూడా. ఈ సరికే చెల్లాచెదురై పోయిన రష్యా ప్రజాస్వామ్య పునరుద్ధరణోద్యమానికి నవాల్నీ మరణం తీవ్రవిఘాతమేనని చెప్పాలి.

# ప్రజలు వేచి చూస్తున్నది ఇందుకోసమా?



టంకశాల అశోక్

**కాంగ్రెస్‌కు తెలంగాణ ఏర్పడిన పదేండ్ల తర్వాత మొదటిసారి అధికారం లభించింది. అటువంటప్పుడు జనరంజకంగా పాలించి తమ హామీలను నెరవేర్చుతూ మరింత ప్రజాదరణ పొందాలి. మొదటి అసెంబ్లీ సమావేశాలను, తొలి బడ్జెట్ ప్రతిపాదనలను అందుకు సద్వినియోగం చేసుకోవాలి. గత ప్రభుత్వ వైఫల్యాలని తాము భావించేవి ఆ క్రమంలో ముందుకు తేవచ్చు. కానీ తమ పరిపాలన ఇంకా కుదుటపడకుండానే, ప్రజలకు ఇంకా సానుకూల అభిప్రాయం ఏర్పడక ముందే, బీఆర్ఎస్‌పై ఎన్నికల రోజుల్లో వలె దాడిని కొనసాగించడమే ప్రధానమైన అజెండా అన్నట్లు వ్యవహరించడం చూసేవారికి విచిత్రంగా తోచటమేగాక, చివరకు ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.**



తమను ఎన్నుకున్న ప్రజలకు చెప్పేందుకు, చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి డిసెంబర్ రెండవవారం నుంచి ఈ రెండున్నర మాసాల్లో కొన్ని అవకాశాలు లభించాయి. ఇంతలోనే ఏదేదో జరిగిపోవాలని ప్రజలేమీ ఆశించడం లేదు. అది సాధ్యం కాదు కూడా. కానీ తొలి లక్షణాలు అంటూ కొన్ని ఉంటాయి. ప్రజలు ఎన్నో ఆశలతో అధికారాన్ని అప్పగించినందున ఎన్నెన్నో ఆశాభావాలతో ప్రతి అడుగును గమనిస్తుంటారు. తాము ప్రజల కోసం చేయగలదేమిటో, అది గత ప్రభుత్వం కన్నా ఏ విధంగా మెరుగైనదో చెప్పేందుకు, ఆచరణలో చేసేందుకు ఈ తొలిదశలో కొత్త ప్రభుత్వానికి కొన్ని అవకాశాలు లభించాయి. అవి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం, కొత్త బడ్జెట్లో చేసే ప్రతిపాదనలు, 100 రోజుల గడువులోగా అమలుకు తేగలమన్న హామీలను వీలైనంత చేసి చూపించటం, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు సంబంధించి ఈలోగా ఏవైనా పరిస్థితులు అత్యవసరంగా ముందుకు వస్తే ఆ విషయంలో తగినట్లు వ్యవహరించడం, ఇతర సమస్యలు ఉత్పన్నమైతే వాటిని పరిష్కరించుకోవడం వంటివి.

> ప్రభుత్వం ఏర్పడి కొన్నాళ్లు గడిచి అంతా షరా మామూలుగా మారిపోతే అది వేరు. అప్పుడైనా ప్రజల చైతన్యం ఈ సరికి ఎంతగా పెరిగింది, సోషల్ మీడియా ప్రభావం ఎట్లా తయారయింది అంటే అధికారంలోని వారికి విశ్రాంతి అంటూ లేని కాలం వచ్చింది. అందువల్ల ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన తొలిదశలోనైనా, అది కూడా మీరు గత ప్రభుత్వంపై వెయ్యిన్నొక్క విమర్శలు చేసి కుప్పతెప్పలుగా హామీలు ఇచ్చినప్పుడు, ప్రభుత్వపు మాటలను చేతలను మూడు కోట్ల మంది ప్రజలు ఆరుకోట్ల కండ్లతో నిరంతరం గమనిస్తుంటారు. ఈ మాట ప్రభుత్వ పెద్దలు గ్రహించలేనిది కాదు. అటువంటప్పుడు ఈ రెండున్నర నెలల కాలంలో వారి వ్యవహరణ అందుకు తగినట్లు ఉందా అనేది ప్రశ్న.

ఈ రోజులలో ప్రభుత్వం కొన్ని చిన్నచిన్న పనులు చేయలేదని కాదు. కానీ సమస్య ఏమంటే అదంతా ప్రతిపక్షంపై ఎడతెగని నిరంతర విమర్శలు, ఆరోపణలు, ఆత్మరక్షణ ప్రయాసల హోరులో కొట్టుకుపోయింది. ఫలితంగా ఈ రోజున ప్రజల నుంచి వినవస్తున్న మాట, ఏమున్నది, ఏం చేస్తున్నారు? ఒకళ్లను ఒకళ్లు తిట్టుకొనుడు తప్ప అని. ప్రభుత్వం జాగ్రత్తగా గుర్తించవలసింది ఏమంటే తిట్టుడు పని' అనేది ప్రతిపక్షం చేసినట్లయితే ప్రజలు అది వారికి మామూలే, వాళ్ల పని అది కదా అన్నట్లు తీసుకుంటారు. కానీ ప్రభుత్వ పక్షం అట్లా చేస్తే చేయవలసిన పని చేయకుండా ఇదేమిటి అంటారు. ప్రభుత్వం ప్రధాన బాధ్యత పరిపాలన, మంచి పాలన అన్నది ప్రజల అభిప్రాయం. ఆ పని చేస్తూ విమర్శలు కూడా సాగిస్తే అది వేరు. కానీ ప్రస్తుత సందర్భంలో గమనించదగినది ఏమంటే ప్రజలకు ప్రభుత్వం చేస్తున్నది ఏమిటో కనిపించడం లేదు. లేదా అరకొరగా మాత్రమే కనిపిస్తున్నది. అందుకు భిన్నంగా రకరకాల పేర్లతో రాత్రింబవళ్లు అసెంబ్లీ లోపల బయట మొత్తం మంత్రులు, పార్టీలోని ఇతర నాయకులు అయినదానికి కానిదానికి బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా మార్చుకున్నారు. శేషం కోపేన పూరయేత్ అన్నట్టు శేషం దూషణః పూరయేత్‌గా మారింది. ఇది ప్రజలకు నచ్చడం లేదు. ఈ మాట ప్రభుత్వం దృష్టికి వస్తున్నదీ లేనిదీ తెలియదు. అది చాలదన్నట్లు మరికొన్ని జరుగుతున్నాయి. ఎన్నికల తర్వాత నుంచి ప్రజలు అన్నింటికన్నా ముఖ్యంగా ఎదురుచూస్తున్నది హామీల అమలు కోసం. వాటి తీరు ఎట్లున్నదో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. 6 గ్యారెంటీలలోని 13 హామీలు, అధికారానికి రాగానే డిసెంబర్ 9న చేయగలమన్న రూ.2 లక్షల రైతు రుణమాఫీ కలిపి మొత్తం 14 హామీలు కాగా, అందులో అమలుకు వచ్చింది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఒక్కటే. ఇక బడ్జెట్ కీలకం కాగా, ఆరు హామీలకు రూ.53,196 కోట్లు అనటం మినహా ఏ హామీకి ఎంత అవసరం అనే వివరం లేదు. సదరు హామీలకు ఆ మొత్తం చాలదని, అవిగాక మేనిఫెస్టోలోని అనేక ఇతర హామీల మాటేమిటని సభ్యులు, బయట ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు వివరణ లేదు. ప్రజలు ఎదురుచూస్తున్న ఈ అతి ప్రధానమైన విషయం పరిస్థితి ఈ విధంగా ఉండటం, వందరోజుల గడువుకు ఇంకా నెలరోజులు కూడా లేకపోవడంతో ప్రజలలో ప్రభుత్వం పట్ల విశ్వాసం దెబ్బ తినటం మొదలైంది. అది ఇంకా నశించనైతే లేదు గానీ తగ్గటం మొదలైంది.

ఈ స్థితిని అర్థం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు బదులు ప్రభుత్వ పక్షం ఎన్నికల ప్రచార ధోరణి నుంచి ఇంకా బయటపడక శ్వేతపత్రాలు, మేడిగడ్డకు వరుస సందర్శనలు, అసెంబ్లీలో ప్రతిరోజు దూషణలు, సభలో లేని కేసీఆర్‌పై పరుషమైన భాషతో సవాళ్లు, ఎవరేది ప్రశ్నించినా, కనీసం వివరించబూనినా అరడజను మంది మంత్రులు విరుచుకుపడుతూ అజెండాతో సంబంధం లేని విషయాలు ముందుకు తేవడం ఒక నిత్యకృత్యం అయింది. ఈ పద్ధతిలో బీఆర్ఎస్‌పై ప్రజల అనుమానాలను పెంచగలమని, రాజకీయంగా లబ్ధి పొందగలమని, బహుశా అంతే ముఖ్యంగా తమ నిష్క్రియాపరత నుంచి, హామీల అమలు వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చగలమని అధికారపక్షం ఆశిస్తుండవచ్చు. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఆ విధంగా లేదని గ్రహించడం, తమ తీరును మార్చుకోవటం వారికే మంచిది.

> ఆర్థిక పరిస్థితి పైన, నీటిపారుదల పైన, ప్రాజెక్టులను కృష్ణా రివర్ బోర్డుకు అప్పగించటం పైన, మేడిగడ్డ పైన సభలో జరిగిన భీకరమైన చర్చలో హరీశ్‌రావు, కేటీఆర్, కడియం శ్రీహరి, అక్బరుద్దీన్‌ల ఆధారసహిత, పటిష్ఠ వాదనలతో చివరకు ప్రభుత్వాన్నే ఆత్మరక్షణలో పడవేయటాన్ని టీవీ చానళ్లలో చూసిన వారంతా గమనించారు. యథాతథంగా మేడిగడ్డ ఉదంతం ప్రభుత్వానికి ఒక ఆయుధంగా ఉపయోగపడగలదే. కానీ ఆ ఇంజనీరింగ్ వైఫల్యం కేసీఆర్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేసిందన్నట్లు చూపబోవటం ప్రస్తుత ప్రభుత్వం చేసిన మొదటి వ్యూహాత్మక తప్పిదం.

జరిగిన నష్టం పరిమితమైనదని, అందుకు మరమ్మతులు చేయవచ్చునని, లోగడ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనూ ఇటువంటి ఘటనలు అనేకం జరిగాయని, మేడిగడ్డపై విచారణ జరిపి దోషులను శిక్షించవలసిందేనని, ఎటువంటి విచారణకైనా తాము సిద్ధమని, పథకాన్ని తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డకు మార్చేందుకు ఫలానా సహేతుకమైన కారణాలున్నాయని, ప్రాజెక్టులు బోర్డుకు అప్పగించడానికి సంబంధించిన వాస్తవాలని, అధికార పక్షం చేస్తున్న ఆరోపణలు నిజమని తేలితే తాను అసెంబ్లీకి రాజీనామా చేయడమే కాక తిరిగి సభలో అడుగుపెట్టబోనని హరీశ్‌రావు అడుగడుగునా డాక్యుమెంట్ల ఆధారంగా చేసిన సమర్థవంతమైన వాదనలు, ప్రభుత్వ వాదనలలో గల పరస్పర వైరుధ్యాలను ఆయన ఎత్తిచూపిన తీరు ప్రభుత్వాన్ని ఎంత కలవరపరిచిందో, ఆ ప్రసారాలను చూసిన ప్రజలను అంతగా అబ్బురపరిచింది. ఇటువంటి వాదసంవాదాలు బహుశా తెలుగు రాష్ట్రాల శాసనసభ చరిత్రలోనే ఎప్పుడూ లేవు.

> వెరసి ఫలితం ఏమంటే కాంగ్రెస్ పార్టీ ఇంత ఘనంగా గెలిచి కూడా 100 రోజులు గడవడానికి ముందే ఆ ఘనత వెలవెలబోయింది. అందుకు ఒక కారణం వివిధ హామీల అమలులో తాత్సారాలు, అస్పష్టతలు కాగా, రెండవ కారణం ఈ విధమైన సభా దృశ్యాలు కాగా, మూడవది ఇతరత్రా కనిపిస్తున్న కొన్ని విషయాలు. ఆటోలవాళ్లు తీవ్రసమస్యను ఎదుర్కొంటున్నా మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా వారికి రూ.12 వేల ఆర్థిక సహాయం ప్రకటించకపోవడం, ఇతర పరిష్కార మార్గాలు ఏవీ చెప్పకపోవడం వాటిలో ఒకటి.

లక్షలాది ఆటో డ్రైవర్లను ప్రభుత్వం గాలికి వదిలివేసింది. పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా చలనం లేదు. పెన్షన్లు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెల్లింపులో జాప్యాలు, నిరుద్యోగ భృతిపై ఉలుకుపలుకు లేకపోవడం, రైతు బీమాను అసలు ప్రస్తావించకపోవడం, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు సహాయంపై కదలిక లేని స్థితి, దళితబంధు ఆపివేత వంటివి అనేకం ఒక పెద్ద జాబితాగా తయారై ప్రజలలోని వివిధ వర్గాలకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికలలో తీవ్ర విషయంగా మారిన ఉద్యోగాలకు సంబంధించి, ఇంతవరకు తామన్నట్లు జాబ్ క్యాలెండర్ కానీ, నోటిఫికేషన్లు గానీ లేకపోగా, బీఆర్ఎస్ ప్రభుత్వమే నోటిఫై చేసి, దాదాపు చివరకు తెచ్చిన సుమారు పాతికవేల ఉద్యోగాలకు ఇప్పుడు నియామక పత్రాలు అందజేసి, అవన్నీ తామే నోటిఫై చేసి ఇచ్చినట్లు చెప్పుకోవటాన్ని గమనించనివారు ఎవరూ యువకులలో గానీ, ప్రజలలో గానీ ఉన్నట్లు లేరు. ఇవన్నీ చాలవన్నట్లు లోగడ బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ లేని వ్యవసాయానికి నీటి కొరతలు, అన్ని రంగాలకు విద్యుత్తు కొరతలు ప్రస్తుతం మొదలయ్యాయి. వాటిపై ప్రభుత్వ చర్యలు కనిపించడం లేదు.

ఇటువంటివి సక్రమంగా జరిపి ప్రభుత్వం ప్రజలలో మంచిపేరు తెచ్చుకుండినట్లయితే అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చిన అం శాల విషయమై ప్రభుత్వానికి ప్రజలలో మద్దతు లభించి ఉండేదేమో. బీఆర్ఎస్‌పై విమర్శలకు ప్రజలు విలువ ఇచ్చి ఉండేవారేమో. కానీ అట్లా జరగకపోవడంతో మద్దతు రాకపోవడమే గాక, ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటున్న సూచనలు కనిపిస్తున్నాయి. కనుక ఈ రెండున్నర మాసాల కాలపు ఈ వివిధ అనుభవాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మేల్కొలుపు కాగలవా?

# తెలంగాణవాదానికి కేరాఫ్ బీఆర్ఎస్సే!



పలుగుచెరువు మహేశ్

**పార్లమెంటులోనైనా, ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీలోనైనా తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తెగించి కొట్లాడిన పార్టీ బీఆర్ఎస్. తెలంగాణ హక్కులు, వాటా, నిధుల కోసం పోరాడింది బీఆర్ఎస్ పార్టీ. ఇందుకు ఎన్నో చారిత్రక ఆధారాలు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ తెలంగాణను దేశంలోని 29 రాష్ట్రాల్లో కేవలం ఒక రాష్ట్రంగా పరిగణిస్తే బీఆర్ఎస్ మాత్రం పదేండ్లలో తెలంగాణ హక్కుల కోసం, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై పార్లమెంట్ సాక్షిగా మోదీ సర్కారును నిలేసింది. తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్రానికి సాధించింది శూన్యం. అందుకే నేనంటున్నా తెలంగాణ బలం, గళం, దళం బీఆర్ఎస్సేనని.**

కొండంత నమ్మకంతో రేవంత్ రెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా గతంలో గెలిపిస్తే రాష్ట్రానికి హామీ ఇచ్చిన నిధులేవీ తీసుకురాలేకపోయారు. ఆ పార్టీలోని మిగతా ఇద్దరు ఎంపీల సంగతి సరేసరి. కానీ బీఆర్ఎస్ ఎంపీలు మాత్రం ప్రతి పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం గళమెత్తారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన ఫలితాలు రాకపోవడం పట్ల బాధ పడాల్సిన, భయపడాల్సిన అవసరం లేదన్నది ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలపై నాలుగు రోజులు ఆగితే ప్రజలే ఆ పార్టీని కడిగి పారేస్తారు. ఇక గత రెండు పార్లమెంట్ ఎన్నికలను పరిశీలిస్తే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ దాదాపు 10 శాతం ఓట్లను ఎక్కువగా పొందింది. రాష్ట్రంలోని మొత్తం 120 మున్సిపాలిటీల్లో 105 బీఆర్ఎస్ చేతిలోనే ఉన్నాయి. ఆరు కార్పొరేషన్లు బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమమైనా, రాష్ట్ర పరిపాలన అయినా వాటిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్క్‌ను ఎవరూ చెరిపేయలేరు. తెలంగాణ అంటే దేశంలో ఎక్కడైనా గుర్తుకు వచ్చే ఏకైక పేరు కేసీఆర్ మాత్రమే! కేసీఆర్ వల్ల తెలంగాణ రాష్ట్రానికి అస్తిత్వం, ఆత్మగౌరవం వచ్చాయన్నది జగమెరిగిన సత్యం. అందుకే తెలంగాణ వాణిని గురించి ఢిల్లీలో బలంగా వినిపించాలన్నా, తెలంగాణకు ప్రయోజనాలు కలగాలన్నా బీఆర్ఎస్ దండు పార్లమెంటులో ఉండాల్సిందే. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఏనాడూ తెలంగాణ ప్రయోజనాలు గుర్తుకురావు.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్దుకొని ఆత్మ పరిశీలన చేసుకొని ముందుకు కదలాల్సిన అవసరం ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తపై ఉన్నది. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అడ్డగోలుగా, ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చింది. అధికారం వచ్చిన తర్వాత హామీలు ఎగ్గొట్టేందుకు శ్వేత పత్రాల పేరుతో ప్రజల దృష్టి మళ్లించే దిగజారుడు రాజకీయాలు చేస్తున్నది. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 420 హామీలను పక్కనపెట్టి డ్రామాలాడుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ రైతుబంధు డబ్బులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవటంతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా ఆ పార్టీ వ్యవహరిస్తున్నది. అబద్ధాలతో గెలిచిన కాంగ్రెస్ పార్టీ, అదే ప్రచారాన్ని మరోసారి ప్రయోగించాలని చూస్తున్నది. ఆ పార్టీ గోబెల్స్ ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రజలను ఓట్లు అడుగుదాం. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రమే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా బీఆర్ఎస్‌ను సమాయత్తం చేద్దాం. బీఆర్ఎస్‌కు ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదని, ప్రతిపక్షంలో మన పార్టీ ఎలా బాధ్యతాయుతంగా ఉంటుందో గతంలోమాదిరి ఇప్పుడూ చూపిద్దాం. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ఏమాత్రం వెనుకాడినా వారి తరపున కొట్లాడి అవసరమైతే జైలుకు వెళ్లడానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు.




గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ సాధించిన విజయాలను వైఫల్యాలుగా చిత్రీకరించేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తున్నది. వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచిన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా విఫల ప్రాజెక్టుగా చూపించే ప్రయత్నం చేస్తున్నది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.5 వేల కోట్ల టెండర్లను రద్దు చేసేందుకు ఎత్తుగడలు వేస్తున్నది. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌లోని హేమాహేమీ నాయకులను కూడా బీఆర్ఎస్ మట్టి కరిపించింది. బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతర కృషి చేస్తున్నది. అందుకే ఈసారి ప్రజలు కాంగ్రెస్ పార్టీ మాయలో పడకుండా బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలి.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ నాయకులు)

**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సామాజిక, ఆర్థిక భద్రత కోసం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కొన్నేండ్లుగా ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టింది. దాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.**

# ఓపీఎస్ కోసం ఎదురుచూపులు



పాకాల శంకర్ గౌడ్
98483 77734

తెలంగాణ రాష్ట్రంలో 3.28 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉండగా వీరిలో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారు. నూతన ఉద్యోగ నియామకాల వల్ల ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది. సీపీఎస్ విధానాన్ని కేంద్రం సూచనల మేరకు దేశంలోని మెజారిటీ రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. పెన్షన్ల ఆర్థిక భారం ప్రభుత్వాలపై పడకుండా ఉండడానికి ఈ సీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చారు. కానీ ఇందులో ఉద్యోగుల సామాజిక, ఆర్థిక భద్రతను విస్మరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీపీఎస్ విధానంపై 23 ఆగస్టు 2014న ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనితో 1 సెప్టెంబర్ 2004 తర్వాత నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందరూ దీని పరిధిలోకి తీసుకువచ్చినట్లు అయింది. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ విరమణ సమయంలో వచ్చే 50 శాతం పెన్షన్, కుటుంబ సభ్యులకు వచ్చే 30 శాతం పెన్షన్, కనీసం రూ.16 లక్షల గ్రాట్యుటీ, కమ్యూటేషన్ వంటి సౌకర్యాలను ఉద్యోగులు కోల్పోతున్నారు.

సీపీఎస్‌లో ఉద్యోగి, ఉద్యోగంలో ఉండగా మరణిస్తే వారికి వచ్చే పెన్షన్ ప్రభుత్వం ఇచ్చే ఆసరా పెన్షన్ల కన్నా తక్కువ ఉన్న సందర్భాలు ఉన్నాయి. సామాజిక ఆర్థిక భద్రత లేక వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. వారి కుటుంబాలకు భద్రత కల్పిస్తూ భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ వారి జీవితాంతం ప్రజలకు సేవ చేసిన ఉద్యోగులను కాపాడాల్సిన సామాజిక బాధ్యత ప్రజలపై ఉంది. నూతన పెన్షన్ విధానాన్ని రూపొందించి అమలు చేస్తున్నప్పటి నుండి దేశవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమాలు చేయడం ప్రారంభించాయి. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నారు.

సీపీఎస్‌లో ఉద్యోగి బేసిక్ పే, డీఏలతో కలిపి 10 శాతం, మ్యాచింగ్ గ్రాంట్‌గా ప్రభుత్వం నుంచి మరో 10 శాతం సొమ్మును కలిపి నేషనల్ పెన్షన్ స్కీం ట్రస్ట్‌లో జమ చేస్తారు. ఉద్యోగికి కేటాయించిన పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నెంబర్(ప్రాన్)లో ఈ సొమ్ము జమవుతుంది. ఉద్యోగ విరమణ పొందే నాటికి జమ అయిన మొత్తం నుంచి 60 శాతం డబ్బును మాత్రమే ఉద్యోగికి నగదుగా చెల్లిస్తారు. మిగతా 40 శాతం డబ్బును భారతీయ స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెడతారు. దానిపై వచ్చే లాభాన్ని నెలవారీ పెన్షన్ కింద రిటైర్డ్ ఉద్యోగికి చెల్లిస్తారు. ఒకవేళ షేర్ మార్కెట్లో నష్టాలను చవిచూస్తే ఉద్యోగి డబ్బుల నుంచి తీసుకుంటారు. స్టాక్ మార్కెట్ లాభనష్టాలపై ఉద్యోగి పెన్షన్ ఇవ్వడం అనేది చాలా విచారకరం. వారి సొమ్ముకు ఆర్థిక భద్రత లేకుండా పోతున్నది. సీపీఎస్ నష్టదాయకంగా ఉందని దాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ని అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్యోగుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని కొన్ని రాష్ట్రాలు సీపీఎస్ విధానాన్ని రద్దు చేశాయి. ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆకాంక్షలను గమనించి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని ప్రకటించింది. ఈ హామీని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




## ప్రజల గళమే ప్రతిపక్షం



ప్రతిపక్షం ఎందుకు ముఖ్యమైనది? పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో విపక్షానికి అధికారిక, గుర్తింపు పొందిన హోదా ఉంటుంది. ప్రభుత్వాన్ని సవాల్ చేసేందుకు దానికి కొన్ని హక్కులుంటాయి. అది తనను ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా చూపించుకుంటుంది. ప్రభుత్వంతో సహా మొత్తం ప్రజల గళాన్ని ప్రతిపక్షం ప్రతిబింబిస్తుంది.

- సాగరికా ఘోష్, ప్రఖ్యాత జర్నలిస్ట్